

సమస్యలు పరిష్కరించాలి

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. - 8లో



ఆశలు..ఆ'విరి'

బంతి, చామంతి పూల ధరలు పతనమయ్యాయి. కొనేవారు లేక రోడ్డుపై పారబోస్తున్నారు. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. - 8లో



దయ చూపండయ్యా!

మా వేదనను మొరపెట్టుకుంటున్నాం.. మాపై దయ చూపండయ్యా.. అని ప్రజలు కోరారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

సాయిబుల కుంట ఆక్రమణ



కుంట కట్టను తవ్వుతున్న జేసీబీ

గంగవరం: మండలంలోని మేలమాయి రెవెన్యూ పరిధిలో సాయిబుల కుంట ఆక్రమణకు గురైంది. పలమనేరు– మదనపల్లె జాతీయ రహదారిలోని అప్పినపల్లి క్రాస్ సమీపంలోని సాయిబులు కుంట సర్వే నంబర్ 685లో 1.66 ఎకరాల విస్తీర్ణం ఉంది. ప్రస్తుతం కుంట పరిస్థితి చూస్తే ఎకరా కూడా లేకపోవడం గమనార్హం. చాలా ఏళ్లగా ఈ కుంట ఆక్రమణలో ఉన్నట్టు పలువురు ఆరోపించారు. కుంట పక్కన భూములున్న వారు కుంట స్థలాన్ని ఆక్రమించుకుని సరిహద్దులుగా రాతి బండలు నాటారు. అంతే కాకుండా కుంట సమీపంలోని ఇటుకల బట్టీ నిర్వాహకుడు కుంటను కొద్దికొద్దిగా జేసీబీతో తవ్వి, తన అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే కుంట సరిహద్దు, కట్టను తొలగించి ఆక్రమిత స్థలంలో దుకాణ రూములు నిర్మించి, బాడుగకు ఇచ్చుకున్నాడు. ఇంత జరుగుతున్నా ఏ రోజూ రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ విషయమై స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా స్పందించి ఆక్రమణకు గురైన కుంటను తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నల్లబ్యాడ్జీలతో 108 ఉద్యోగుల నిరసన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా సోమవారం 108 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమ్మె సైరన్ మోగించి, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీతాలు సకాలంలో ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, షిఫ్ట్ ప్రాతిపదికన డ్యూటీలు వేయాలని, ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. జిల్లా నుంచి 20 మంది ఉద్యోగులు విజయవాడకు బయలు దేరారు. రాత్రికి ప్రభుత్వం పిలిచి, సమస్యల ను పరిష్కరిస్తుందని ఎదురు చూస్తున్నారు. అలా ప్రభుత్వం పిలుపు నివ్వకపోతే, సమ్మె మరింత బలపడుతుందని 108 వాహన ఉద్యోగులు చెబుతున్నారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ



స్వర్ణ పంచాయతీ డేటాను పరిశీలిస్తున్న డీపీఓ

గంగాధర నెల్లూరు: మండల పరిషత్ కార్యాలయాన్ని డీపీఓ సుధాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరుగుచున్న స్వర్ణ పంచాయతీ డేటాను ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేస్తున్నారు.. ఒకొక్క డేటా ఎంట్రీకి ఎంత సమయం పడుతుందన్న విషయం పరిశీలించారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి, స్వర్ణ పంచాయతీ డేటాను తప్పులు లేకుండా, సక్రమంగా, త్వరితగతిన ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కాలనాగు ఒక్కసారే కాటేస్తుంది.. ఈ కరెన్సీ నాగులు మాత్రం అనుక్షణం కాటేస్తూనే ఉంటాయి.. నోట్ల కట్టల మత్తెక్కిపోయి.. మానవత్వం మరిచి..పేదల నడ్డివిరిచేలా వడ్డీలు గుంజి.. చెల్లించకుంటే దాడులు చేసి, ఇంట్లో సామగ్రి, భూములు లాక్కొంటున్నాయి. ఫలితంగా సామాన్య పేద రైతు కుటుంబాలు ఊరొదిలి వెళ్లేలా చేస్తున్నాయి. ఇంత జరిగినా తమకేమీ పట్టనట్టు అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది. ఇదీ వడ్డీవ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కి విలవిలలాడుతున్న ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు దీనగాథ.



ఊరునాయునిపల్లి గ్రామం

పల్లెల్లో పైసాచికం

సీఎం ఇలాకాలో విలవిల్లాడుతున్న పేద రైతులు

- రూ.5 నుంచి రూ.15 వడ్డీ
- ఏ ఇబ్బంది వచ్చినా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిందే
- 15 రోజులకోసారి వసూలు
- గంట ఆలస్యమైనా తప్పని దాడులు
- సగానికి పైగా భూములు వ్యాపారుల పరం
- భరించలేక ఊళ్లు వదిలివెళుతున్న బాధితులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- ఇదీ ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు దుస్థితి

కుప్పం రూరల్: సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంలోని ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు గ్రామాలు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కి బిక్కుబిక్కుమంటున్నాయి. మూఢ నమ్మకాల గ్రామాలుగా పేరొందిన ఈ గ్రామాలు ఇప్పుడిప్పుడే ఆ నమ్మకాల నుంచి బయటపడుతున్నాయి. ఇంతలోనే మరో మహమ్మారి రెండు గ్రామాలను ఛిద్రం చేస్తోంది. అదే వడ్డీ వ్యాపారులనే మహమ్మారి. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు వీరంతా. వారి అవసరాలు ఆధారంగా రూ.5 నుంచి రూ.15 వరకు వడ్డీ వసూలు చేస్తూ పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. ష్యూరిటీల పేరిట ఇప్పటికే సగానికి పైగా గ్రామంలోని భూములను వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకున్నారంటే వడ్డీ వ్యాపారుల దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతుంది.



పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం


ఈ రెండు గ్రామాలు వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకుని ఊపిరాడక కొట్టుమిట్లాడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. జనం వడ్డీలు కట్టలేక వలస వెళుతున్నా ఎవరికీ పట్టడం లేదు. గ్రామాల్లో తరచూ వడ్డీ వ్యాపారుల దాడులు జరుగుతున్నా, సమాచారం లేదనే నెపంతో వీరిని పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో గ్రామసభలు పెట్టి అవగాహన కల్పించాలనే కనీస ఆలోచన ప్రభుత్వ యంత్రాంగంలో లేకపోయింది. దీంతో నిత్యం ఓ కుటుంబం వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. బ్యాంకర్లు అయినా ఈ రెండు గ్రామాల జనానికి విరివిగా రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సి ఉంది. లేదంటే వీరి పరిస్థితి అథోగతే.

వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి సగానికి పైగా భూములు

ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు గ్రామాలవాసులు వడ్డీ చెల్లించలేని స్థితిలో తమ భూములను సైతం వడ్డీ వ్యాపారుల పాలు చేశారు. పేదలు వారికి డబ్బు ఇస్తే తిరిగి చెల్లించలేరని, ఎలాగైనా వారి భూములు కొట్టేయాలని ముందుచూపుతో వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చే సమయంలోనే వారి భూములను వ్యాపారుల పేరున రాయించుకుంటున్నారు. ఒక నెలా రెండు నెలలు వడ్డీ చెల్లించకపోతే భూములు వదులుకోవాల్సిన పరిస్థితి దాపరించింది. చాలా మంది వడ్డీ కట్టలేక, తీసుకున్న డబ్బులు చెల్లించలేక భూములను వడ్డీ వ్యాపారులకు వదిలిపెట్టి గుట్టుచప్పుడు కాకుండా కుటుంబాలకు కుటుంబాలుగా ఊరు వదిలి వెళుతున్నారు. ఇప్పటికే కుప్పం సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఈ రెండు గ్రామాలకు చెందిన భూములు పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారుల పేర్లపై మారుతున్నాయి. ఊరునాయునిపల్లి గ్రామంలో కొంతవరకు పరిస్థితి ఒక రకంగా ఉన్నా, ఊరునాయునికొత్తూరు గ్రామంలో మాత్రం ఉన్న 80 కుటుంబాల్లో 20 కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాయంటే వడ్డీ వ్యాపారులు ఒత్తిడి ఏమేరకు ఉందన్న విషయం అర్థమవుతుంది. మరో నాలుగు సంవత్సరాలు పరిస్థితి ఇలాగే కొనసాగితే ఊరు మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి దాపురిస్తుంది.



జనం లేక బోసిపోయిన ఊరునాయునికొత్తూరు గ్రామం



వడ్డీలు కట్టలేక వలస వెళ్లడంతో మూతపడిన ఇల్లు

వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో..

కుప్పం మండలంలోని గుడ్లనాయనపల్లి పంచాయతీలో ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు అటవీ గ్రామాలున్నాయి. ఊరునాయునిపల్లిలో 140 గృహాలకు గాను 845 మంది, ఊరునాయునికొత్తూరులో 80 కుటుంబాలకు 450 మంది జీవనం సాగిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ రెండు గ్రామాల్లో మూఢనమ్మకాలు రాజ్యమేలేవి. మహిళలు బహిష్టులు అయితే గ్రామానికి దూరంగా ఉండడం, గ్రామాల్లో చెప్పులు లేకుండా తిరగడం తదితర ఆనవాయితీలు ఈ పల్లెల్లో ఉండేవి. ప్రభుత్వాలు, కొంత మంది సామాజికవేత్తల కృషితో ఇప్పుడిప్పుడే నాగరిక ప్రపంచంలోకి అడుగులు వేస్తోంది. ఇంతలోనే వీరిని వడ్డీ వ్యాపారులనే మహమ్మారి చిదిమేస్తోంది. ఈ రెండు గ్రామాల్లో మొత్తం 220 కుటుంబాలు దాదాపుగా కూలీ పనుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఏ అవసరం వచ్చినా డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులనే ఆశ్రయించాల్సి ఉంది. వేరే ఆదరవు లేదు. కూతురుకు పెళ్లి చేయాలన్నా, ఏదైనా పంటలకు పెట్టుబడి కావాలన్నా.. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా వడ్డీ వ్యాపారులే దిక్కు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీ వ్యాపారులు రూ.5 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తూ వారిని అప్పుల పాలు చేస్తున్నారు. కొంత మంది అయితే ఈ వడ్డీని సైతం 15 రోజులకోసారి వసూలు చేస్తూ జనం రక్తాన్ని పీలుస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం గంట ఆలస్యమైనా వడ్డీ వ్యాపారులు వారి మనుషులతో వచ్చి దాడులకు దిగుతున్నారు. చేసేది లేక ఇళ్లు లేనివారు వంట పాత్రలు, బిందెలు తెచ్చి వారికిచ్చి మరీ వడ్డీలు చెల్లిస్తున్నారు.

కొడుకుల వలసతో ఒంటరినయ్యాను



నాకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు జీవనోపాధికి బెంగళూరుకు వలస వెళ్లారు. ఉన్న ఒక కొడుకు వడ్డీ వ్యాపారుల బారీన పడి ఉన్న భూమిని అమ్ముకుని వలస వెళ్లిపోయాడు. నేను ఒంటరిని అయ్యాను. భూమి పోయింది. కొడుకు వెళ్లిపోయాడు. ఈ వయసులో నేనేం చేయాలి (కన్నీళ్లు పెట్టుకుంటూ). ఎవరైనా దేవుడు మా వాళ్లకు మంచి చేస్తే బాగుండు.

– మలప్ప, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

నేనూ బాధితుడినే..



నేను కూడా వడ్డీ వ్యాపారుల బాధితుడినే. అవసరం ఆధారంగా రూ.15 వడ్డీ వసూలు చేస్తున్నారు. గంట ఆలస్యమైనా బూతులు తిట్టడం, దౌర్జన్యాలు చేస్తున్నారు. గ్రామంలో చులకనగా మాట్లాడడం, పని దగ్గరకు వచ్చి యజమానికి చాడీలు చెబుతున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం అయినా ఆదుకుని, వడ్డీ వ్యాపారుల భారీ నుంచి కాపాడాలి.

– రంజిత్, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

అవసరాన్ని ఆసరాగా చేసుకుని..



మా ఊళ్లో అందరు పేదలే. కూలి పనులు చేసుకుంటే గానీ కుటుంబాలు గడవవు. ఏ అవసరం వచ్చినా వడ్డీ వ్యాపారులే గుర్తుకు వస్తారు. అవసరానికి ఎక్కువ వడ్డీ అయినా తీసుకుంటున్నారు. వీరి ఆసరాన్ని ఆసరాగా చేసుకుని, వడ్డీ వ్యాపారులు నెలా, పదిహేను రోజులకొకసారి రూ.5 నుంచి రూ.15కు పైగా వడ్డీ వసూలు చేస్తున్నారు. ఆలస్యమైతే దాడులకు దిగుతున్నారు. చేసేది లేక ఇంటి సామగ్రి, ఉన్న అరకొర ధాన్యాలు అమ్ముకోవాల్సి వస్తోంది.

– గోవిందు, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

స్థానికులకు తోడు తమిళ తంబీలు

నిత్యం ఈ రెండు గ్రామాలపై పదుల సంఖ్యలో వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ కంపెనీలు దాడులు చేస్తున్నాయి. స్థానికంగా ఉన్నా వ్యాపారులే కాకుండా తమిళనాడు రాష్ట్రం మహరాజగాడైకు చెందిన వ్యక్తులు సైతం ఈ గ్రామాల్లో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. ఈ తమిళ తంబీలు అయితే వడ్డీ కట్టలేమని బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వెళ్లినా అక్కడికి వెళ్లి వారిపై దాడులకు దిగుతున్నారు. తమిళులు అయితే ముందుగానే వడ్డీలు పట్టుకుని 15 రోజులకోసారి వడ్డీ చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పేదలు ముక్కు పుడకలు, ధాన్యాలు, పాత్రలు అమ్మి అప్పులు కడుతున్నారు. యువకులు అయితే సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు అమ్ముకుని వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ వడ్డీ వ్యాపారం చేసే వారికి ఏ ఒక్కరికీ లైసెన్సులుగానీ, ప్రభుత్వ అనుమతులు గానీ లేకపోయినా రూ.లక్షల్లో వడ్డీలకు ఇచ్చి జనాన్ని దోచుకుంటున్నారు.

మద్యం.. మాయ బేరం



- మద్యం దుకాణాలపై బార్ నిర్వాహకుల కన్ను
- నెలకు రూ.3 లక్షల లాభం.. లైసెన్సు ఫీజుపై హామీ
- పరిమిత గంటల విక్రయాలు.. ఆపై దుకాణం మూత
- మద్యం ప్రియులను బార్‌కు రప్పించి.. దందా చేద్దాం
- పైలెట్ ప్రాజెక్టుగా చిత్తూరు.. పాసైతే జిల్లా మొత్తం
- జిల్లాలో ఎక్సైజ్ అధికారుల వద్దకు చేరిన పంచాయితీ

ఓ ఐడియా.. అక్రమ వ్యాపారానికి తెరలేపనుంది.. మద్యం ప్రియులకు 'ధరా'ఘాతం కానుంది.. ఈ ఆలోచన ఆచరణలోకి వస్తే ప్రభుత్వ ఖజానాకు గండి ఖాయం కానుంది.. బ్లాక్ మార్కెట్‌కు అడుగు పడనుంది.. కూటమి నేతలు సాక్షాత్తు ఓ ఎక్సైజ్ అధికారి వద్దే పంచాయితీకి శ్రీకారం చుట్టారు.

చిత్తూరు అర్బన్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని జిల్లాలో కూటమి నేతలు ఆడుతున్న ఆటలు చూస్తుంటే మతిపోతోంది. ఆవురావురుమంటూ ఆకలితో ఉన్నాం.. కనిపించిందంతా మింగేస్తాం అన్నట్టు అడుగులు వేస్తున్నారు. జిల్లాలో మద్యం బార్ నిర్వాహకులు సరికొత్త ప్రణాళిక రచించారు. మద్యం దుకాణాలన్నీ మింగేసి, మందుబాబులను తమ బార్ గుమ్మం తొక్కేలా కిక్కిచ్చే ఐడియాను రూపొందించారు. దుకాణాలకు తమకు అప్పగించాల్సిందేనంటూ జిల్లాలోని ఓ ఎక్సైజ్ అధికారి వద్ద పంచాయితీ పెట్టారు.

దోపిడీ ఐడియా ఇదే..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన మద్యం దుకాణాల లైసెన్సుల్లో 20 శాతం లాభాలు ఇస్తామని చెప్పడంతో దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.45.32 కోట్ల ఆదాయం లభించింది. ఇక జిల్లాలో నిర్ణయించిన 104 మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. అయితే మద్యం కొనుక్కున్న తరువాత దాన్ని తాగడానికి పర్మిట్ గదులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దీంతో లైసెన్సు తీసుకున్న వ్యాపారులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అనధికారిక మినీ బార్లను తలపించే పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకున్నారు. పర్మిట్ గదులు ఇష్టానుసారం ఏర్పాటు చేసుకోవడంతో, మద్యం బార్ల యజమానుల కడుపు మండిపోయింది. ఒక్కో దుకాణ నిర్వాహకుడికి 20 శాతం లాభాలు ఇవ్వడంతోపాటు ఇలా పర్మిట్ గదులు నడిపితే బార్లు మూసుకోవాల్సిందేనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.60 లక్షల వరకు లైసెన్సు ఫీజులు చెల్లించి, భవనం, సర్వీస్, విద్యుత్ బిల్లులు, పన్నులు అన్నీపోయి తమకు 2 శాతం లాభాలు మాత్రమే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరులో లైసెన్సులు దక్కించుకున్న వారి నుంచి మద్యం షాపులు తాము లీజుకు తీసుకోవాలని, ఇందుకోసం నెలకు రూ.3 లక్షలు చెల్లించడంతోపాటు, పూర్తి లైసెన్సు ఫీజులు తామే చెల్లిస్తామనే ప్రతిపాదన తీసుకొచ్చారు. ఉదయం 2 గంటలు, సాయంత్రం రెండు గంటలు మాత్రమే మద్యం షాపులను తెరిచి ఉంచి, ఆపై మూసేయాలని, తద్వారా మందు బాబులంతా బార్లకు వస్తే ఇక్కడ ఎమ్మార్పీ అనే నిబంధన లేకపోవడంతో ఇష్టం వచ్చిన ధరలకు మద్యం విక్రయించవచ్చని ఐడియా రూపొందించారు.

ఆలోచనలో పడిన అధికారులు..

నెలకు రూ.3 కోట్లకు పైగా మామూళ్లంటే ఆషామాషీ కాదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు రావడంతో ఎమ్మార్పీ ఉల్లంఘనకు అవకాశం లేకుండాపోయింది. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని నివారించడం, సారాపై ఉక్కుపాదం మోపడం కోసం సెబ్‌ను ఏర్పాటు చేయడంతో ఎక్సైజ్‌శాఖలోని కొందరు అవినీతి అధికారుల కోరలు చచ్చుబడిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలు తీసుకురావడం, సెబ్‌ను తీసేయడంతో భారీ ఆకలితో ఉన్న ఎక్సైజ్‌లోని తిమింగలాలకు మళ్లీ ప్రాణం పోసినట్లయ్యింది. మద్యం బార్ యజమానులు తీసుకొచ్చిన సరికొత్త ప్రతిపాదన భలే ఉందని మురిసిపోతున్నారు. కానీ ఈ ప్రతిపాదన ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళితే ఎలా అని ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. తమకు వచ్చే వాటాలను మళ్లీ రాజకీయ నేతలకు పంచడం ఇష్టం లేదని కొందరు అధికారులు బాహాటంగానే పెదవి విరుస్తున్నారు. మరి ఈ ఐడియా ఉపద్రవం తెస్తుందో..? భారీ ద్రవ్యం తీసుకొస్తుందో..? వేచి చూడాల్సి ఉంది.

చిత్తూరు నుంచే..?

ఈ కొత్త ఐడియా చిత్తూరు కేంద్రంగా మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఇందు కోసం మద్యం బార్ కలిగివున్న టీడీపీకి చెందిన ఓ నాయకుడు ముందు నిలబడ్డాడు. జిల్లా కేంద్రంలో తనకు అనుకూలంగా ఉన్న పలువురు బార్ యజమానులను కలుపుకున్నాడు. జిల్లా మొత్తంగా పది బార్లు ఉంటే.. ఒక్క చిత్తూరులోనే ఏడు బార్లు ఉన్నాయి. తొలుత చిత్తూరు నగరంలో మద్యం దుకాణాలను తమకు అప్పగించి వ్యాపారానికి సహకరిస్తే.. మిగిలిన చోట్ల కూడా ఇదే పాలసీను అమలు చేస్తామని చిత్తూరులోని పలువురు ఎక్సైజ్ అధికారులను కలిసి తమ కోరికను బయటపెట్టారు. అధికారులు ఊరికే ఈ పని చేయొద్దని, ఒక్కో మద్యం దుకాణానికి నెలకు రూ.2 లక్షల మామూళ్ల చొప్పున.. రూ.3.12 కోట్ల మామూళ్లు ముట్టజెబుతామని బంపర్ ఆఫర్ ఇచ్చారు.

కృత్రిమ కొరత ఖాయం

కొందరు బార్ యజమానులు తీసుకొచ్చిన ఈ కక్కుర్తి ఐడియాతో టీడీపీ నేతలు స్వలాభం పొందడం ఖాయంగా కనిపిస్తోంది. కానీ ప్రభుత్వ ఖజానాకు మాత్రం భారీగా గండిపడే అవకాశాలున్నాయి. దీని ప్రకారం రోజుకు 4 గంటలు మాత్రమే దుకాణాలను తెరిచి ఉంచడంతో బ్లాకులో మద్యం విక్రయాలు పెరగడం, కృత్రిమ కొరత ఏర్పడం జరుగుతుంది. ఇక మద్యం బార్లలో క్లోజ్ వేయని ధరలు.. మద్యం ప్రియులను సారా, కర్ణాటక మద్యం వైపు నడిపిస్తుంది. పూర్తిగా వ్యవస్థనే నాశనం చేయడానికి తమ్ముళ్లు పన్నిన ఈ కుట్రపై అధికారులు ఎలా ముందుకు వెళతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

పక్కదారి పడుతున్న అన్నా క్యాంటీన్ భోజనం

కుప్పం: పట్టణంలో అన్నా క్యాంటీన్ భోజనం పక్కదారి పడుతోంది. రోజు ఉదయం, మధ్యాహ్నం వంటకాలను అక్షయ పాత్ర సంస్థ సరఫరా చేస్తోంది. ఇటీవల కాలంలో అన్నాక్యాంటీన్‌కు వచ్చే వంటలను నేరుగా పట్టణంలోని ప్రైవేట్ హోటల్‌కు పక్కదారి పట్టించి, టీడీపీ నేతలు కాసులు దండుకుంటున్నా విషయం అలస్యంగా బయటకు వచ్చిందని అధికార పార్టీకి చెందిన ఓ వర్గం ఆరోపిస్తుంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాలకు సంబంధించి ఓ పాత్ర రోజూ మాయమవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అన్నా క్యాంటీన్‌లో పనిచేస్తున్న టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు ఇలాంటి పనులు పాల్పడుతున్నారని అధికార పార్టీకి చెందిన కొందరు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాఉండగా అన్నా క్యాంటీన్‌లో పనిచేసే ఉద్యోగుకుల మార్పేందుకు అధికార పార్టీ నేతల్లోని కొందరు నిందలు వేస్తున్నారని అదేపార్టీకి చెందిన మరో వర్గం ఆరోపిస్తుంది. ఇలా ఒక వర్గంపై మరో వర్గం ఆరోపణలు చేస్తుండడంతో అన్నా క్యాంటీన్ నిర్వహణ కూడా రాజకీయ రంగు పులుముకుంది.

వీఆర్‌కు ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్

గంగాధర నెల్లూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న ఆంజనేయులు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గురుస్వామిని వీఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పాలసముద్రం స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ లక్ష్మి, పలమనేరు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపి, గుడిపాల స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నవీన్ గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్‌కు కొత్తగా బదిలీపై వచ్చారు.

క్లుప్తంగా

చుడా చైర్‌పర్సన్‌గా హేమలత


హేమలత చేత ప్రమాణం స్వీకారం చేయిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్‌పర్సన్‌గా కటారి హేమలత సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న చుడా కార్యాలయంలో హేమలతతో, చుడా వైస్ చైర్‌పర్సన్, జేసీ విద్యాధరి ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత కాణిపాకం ఆలయ సుందరీకరణకు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు, చిత్తూరులోని కట్టమంచి చెరువు సుందరీకరణకు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు మంజూరు చేస్తూ హేమలత సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, టీడీపీ నేతలు దొరబాబు, ఏఎస్.మనోహర్, సీఆర్.రాజన్, రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మస్తాన్ మృతదేహం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కాలనీకి చెందిన హుసేన్‌సాబ్ కుమారుడు మస్తాన్(41)ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ విషయం కుటుంబసభ్యులు గుర్తించి, అతడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, అప్పటికే అతను మృతి చెందినట్టు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

అయ్యప్ప భక్తుడి మృతి

కార్వేటినగరం: అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లి భక్తుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుల కండ్రిగలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. టీకేఎం పేట పంచాయతీ రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన తిరుమలేష్(45) అయ్యప్ప మాలధారణ చేశారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో పళణి మలైకి వెళ్లే మార్గం మధ్యలో హై బీపీ రావడంతో అతను బస్సులోనే మరణించాడు.

ఆశలు..ఆవిరి


రోడ్డు పక్కన బంతిపూలను పడేస్తున్న రైతులు

నేలతల్లిని నమ్మాడు.. అప్పులు చేసి.. కోటి ఆశలతో విరులు సాగు చేశాడు. అధిక దిగుబడి సాధించాడు.. కష్టాలు తీరి గట్టెక్కుతామని భావించాడు.. ఇంతలోనే ధరలు పతనమయ్యాయి. గిట్టుబాటు ధరలు లేక.. పూలసాగుపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ఫలితంగా పెట్టుబడి దక్కక.. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. ఏమి చేయాలో దిక్కుతోచక కర్షకుడు కంట తడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదీ పడమటి పూలరైతు దుస్థితి.

- ధరలు లేక రైతులు విలవిల
- భారీగా తగ్గిన బంతి, చామంతి పూలధరలు
- ఈదఫా నిండా మునిగిన బంతి, చామంతి రైతులు
- పంట పెట్టుబడి కూడా చేతికిరాని వైనం
- పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు

పలమనేరు: రెవెన్యూ డివిజన్‌లో ప్రస్తుతం పూలను సాగు చేసిన రైతులు ఆశించిన ధరలు లేక కుదేలయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈ దఫా పంట ఉత్పత్తి ఎక్కువైంది. బయటి ప్రాంతాల్లోనూ ధరలు తగ్గుముఖం పట్టడంతో పూలను కొనేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ధరలు పతనమయ్యాయి. రైతులు పూలను కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. కోసి మార్కెట్‌కు తరలించినా బంతి కిలో రూ.3 నుంచి రూ.4 కూడా పలకడం లేదు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైనందున ధరలు పెరుగుతాయోమని రైతులు ఆశలు పెట్టుకున్నారు. ధరలు ఇలాగే ఉంటే కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రైతులకు దక్కేలా లేవు.

బయటి ప్రాంతాల్లో పెరిగిన పూల సాగు

పలమనేరు డివిజన్‌లో ఈ దఫా సుమారు 400 హెక్టార్లలో ఎల్లో మాక్సీజిమమ్ అనే రకం బంతి, మేరీగ్లోబ్ అనే రకం చామంతి పంటను రైతులు ఎక్కువగా సాగు చేశారు. గతంలో నాటు రకాలను పండిచేవారు. అవి ఎకరాకు 4 నుంచి 5 టన్నుల పూలు మాత్రమే దిగుబడి వచ్చేవి. ప్రస్తుతం హైబ్రిడ్ రకాల కారణంగా ఎకరానికి 8 నుంచి 10 టన్నులు దిగుబడి వస్తోంది. కుప్పం ప్రాంతంలోని గ్రీన్ హౌస్‌ల్లో ఎకరానికి మేలిరకం పూలు 15 నుంచి 18 టన్నుల దిగుబడి రావడం గమనార్హం. పంట దిగుబడికి సరిపడా డిమాండ్ లేక ధరలు పతనమవుతున్నాయి. వి.కోట, కుప్పం తదితర పూల మార్కెట్లకు భారీగా సరుకు వస్తున్నా గిరాకీ లేదు.

దక్కని పెట్టుబడి

ఎకరా భూమిలో పూల సాగు చేయాలంటే రూ.80 వేలు ఖర్చు అవుతోంది. ఇక పూలను కోసేందుకు మరో రూ.20 వేలు కూలీలకు వెచ్చించాల్సి వస్తోంది. మొత్తం రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇప్పుడున్న రూ.3 ధరతో ఎకరానికి 8 టన్నులు పండినా రూ. 24 వేలు వస్తోంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా దక్కక నష్టం తప్పడం లేదు. ఈ విషయమై స్థానిక మార్కెట్ సెక్రటరీ సంజీవకుమార్‌ను వివరణ కోరగా పూల ధరలు తగ్గిన మాట నిజమేనన్నారు. తాము వి.కోటలోని పూలమార్కెట్‌కు వెళ్లి అక్కడి వ్యాపారులతో మాట్లాడి పూల ధరలను పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో నాణ్యమైన బంతి రూ. 12 గరిష్టంగా వస్తోందని తెలిపారు.

పతనమవుతున్న ధరలు

ప్రస్తుతం కిలో బంతి పూలు రూ.3 నుంచి రూ.4 వరకు, చామంతి రూ.50గా ఉన్నాయి. సాధారణంగా బంతి రూ.50, చామంతి రూ.100 ఉంటే తప్ప, రైతుకు గిట్టుబాటు కాని పరిస్థితి. ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి విజయవాడకు ఎక్కువగా బంతిపూలను తీసుకెళుతుంటారు. అయితే అక్కడ కూడా డిమాండ్ లేక కొనేవారు రావడంలేదు. దీంతో రైతులు పూలను కోసేందుకు కూలి సైతం రాని పరిస్థితి నెలకొంది. పూలను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఒకవేళ కోసినా పూలను కొనేందుకు వ్యాపారులు రావడం లేదు. మండీలకు తీసుకెళ్లినా కొనేవారు లేక పూలను రోడ్లపక్కన పడేస్తున్నారు.

బంతిపూలు కొనేవారే లేరు



ఎన్నో ఆశలతో ఈ దఫా బంతిని సాగుచేశా. ఇప్పుడున్న ధరలు చూస్తుంటే పంట పెట్టుబడి కూడా రాదు. బయట మార్కెట్లకు తరలిస్తామన్నా వ్యాపారులు కొనడం లేదు. ఎక్కడ చూసినా వ్యాపారాలు లేవు. ఈ ధరలుంటే పూలసాగు చేయడం కంటే భూమిని బీడు పెట్టడం మేలనిపిస్తోంది. – శివ, పూల రైతు, చీలంపల్లి

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి



రైతులు ఆయా సీజన్‌లో ఏటా ఒకే పంట సాగు చేస్తున్నారు. దీంతో పంట దిగుబడి పెరిగి, ధరలు పడిపోతుంటాయి. ఇప్పుడున్న డిమాండ్ ఆధారంగా చిరుధాన్యాల వంటి పంటలను సాగు చేయాలి. వీటికి పెట్టుబడి తక్కువే, చీడపీడల బాధలుండవు. నికరమైన లాభాలుంటాయి. పంటమార్పిడి తరచూ చేస్తుండాలి. – డాక్టర్ కోటేశ్వరరావు, ఏడీ, హార్టికల్చర్

సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం చిత్తూరులో నగరంలోని జిల్లా ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను గుర్తించాలన్నారు. పోలీసుశాఖకు సంబంధించి 31 ఫిర్యాదులు అందాయి. ఇందులో కుటుంబ తగాదాలు, వేధిపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, మోసాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

కిలేడీ చైన్‌స్నాచర్


చైన్ చోరీకి యత్నించిన మహిళ

పుంగనూరు: ఇంటిముందు కూర్చుని ఉన్న మహిళ మెడలో చైను లాక్కెళ్లడానికి యత్నించిన మరో మహిళను పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. కొత్తపేటలో నివాసం ఉన్న భారతి తన ఇంటి ముందు కూర్చుని ఉండగా గుర్తు తెలియని మహిళ వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లింది. దీంతో భారతి కేకలు పెట్టింది. వెంటనే ఆప్రాంత వాసులు చైనులాక్కెళ్లిన మహిళను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామ హత్య కేసులో అల్లుడే హంతకుడు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన వాటర్‌మన్(పంప్ ఆపరేటర్)కృష్ణమూర్తి హత్య కేసులో అల్లుడే హంతకుడని సీఐ శ్రీనివాసులు తెలిపారు. కృష్ణమూర్తి హత్య కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వాటర్‌మన్ కృష్ణమూర్తి కుమార్తెను తవణంపల్లె మండలం నరసింహనపల్లెకు చెందిన మునెప్ప కుమారుడు గిరిబాబుకు ఇచ్చి వివాహం చేశారు. కొన్ని రోజులుగా గిరిబాబు భార్యతో గొడవపడి, వేధించి కొట్టి పుట్టింటికి పంపేవాడు. కృష్ణమూర్తి కుమార్తెకు నచ్చజెప్పి అల్లుడి వద్దకు పంపేవాడు. ఈ క్రమంలో గొడవలు పడ్డారు.దీంతో మామను హతమార్చాలని కుట్ర పన్నాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి తన స్నేహితులు నరసింహనపల్లెకు చెందిన పూర్ణచంద్ర, చిత్తూరు టౌన్ ఇరువారంలోని ముస్లీం కాలనీకి చెందిన అబ్దుల్ ముక్రం ఇద్దరిని మామ కృష్ణమూర్తిని చంపేయాలని పురమాయించాడు. ఇరువురు ద్విచక్రవాహనంపై కృష్ణమూర్తిని కొత్తపల్లె అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓ మామిడి తోటలోకి తీసుకువెళ్లి మద్యం తాగించి బండరాయి, బీరు బాటిల్‌లో తలపై బలంగా కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కృష్ణమూర్తిని చికిత్స నిమిత్తం తిరుపతికి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి గిరిబాబుతోపాటు అతని స్నేహితులు పూర్ణచంద్ర, అబ్దుల్ ముక్రంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. హత్య కేసును వారం రోజుల్లోనే ఛేదించిన సీఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ మణికంఠచందోలు అభినందించారు.

● కార్తీకం..దేదీప్యం



కార్తీకం.. దివ్యజోతుల చెలిమి.. ఆధ్యాత్మిక కలిమి..నవ్యకిరణాల బలిమి.. పుష్కరిణికి దివ్వెల హారం.. దేదీప్యమానం.. మోక్ష సమీరం. కార్తీక సోమవారం సందర్భంగా పుంగనూరులోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పుష్కరిణిలో హిందూజాగరణ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పుష్కరిణి దీపాల వెలుగులతో ధగధగ మెరిసిపోయింది. శివనామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తజనం పులకరించింది. – పుంగనూరు

మొరపెట్టుకుంటున్నాం..దయ చూపండయ్యా!

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల ఆవేదన
- ఉన్నతాధికారులకు వినతులు అందజేత
- స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- వివిధ సమస్యలపై 175 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : 'ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేసి మా వేదనను మొరపెట్టుకుంటున్నాం..దయచూపండి సారూ.' అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించి 175 అర్జీలను ప్రజలు అందజేశారు. ఆ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

గుడి స్థలాన్ని ఆక్రమించుకున్నాడు


ఆక్రమణలు తొలగించాలని కోరుతున్న వరత్తూరు వాసులు

గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోదండరెడ్డి గ్రామంలోని గంగమ్మ ఆలయ భూమిని ఆక్రమించుకున్నాడని ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామస్తుడు కేశవరెడ్డి మాట్లాడుతూ తరతరాల నుంచి ఉన్న గంగమ్మ ఆలయ భూమిని కోదండరెడ్డి ఆక్రమించుకోవడం దారుణమన్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు తమపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ఆలయ ధర్మకర్త ముసుగులో సర్వే నెంబర్ 330/1, 332/1, 579/10, 581/10,11,12,13 సర్వే నంబర్లలో 5.02 ఎకరాలను ఆక్రమించుకున్నట్లు తెలిపారు.

జనగణనతో పాటే సమగ్ర కులగణన జరపాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షులు జ్ఞానజగదీశ్

జాతీయస్థాయిలో తలపెట్టిన జనగణనతో పాటే సమగ్ర కుల గణన నిర్వహించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞానజగదీష్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రకులగణన నిర్వహించిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనాదిగా అగ్రకుల పెత్తందారి శక్తులు, అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలను అణిచివేస్తున్నారన్నారు. ఓబీసీలకు రాజ్యాంగబద్ధంగా రాయితీలు, రిజర్వేషన్ల కోసం అనేక దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీ కమిషన్‌లు నియమించి క్షేత్రస్థాయి స్థితిగతులపై అధ్యయనం చేయించాలని డిమాండ్ చేశారు.

ఆ అధికారిని సస్పెండ్ చేయాలి

బైరెడ్డిపల్లి మండలం దాసర్లపల్లి దళితవాడలో ప్రతిష్ఠించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన మండల అధికారిని సస్పెండ్ చేయాలని దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ బైరెడ్డిపల్లి మండలం దాసర్లపల్లి దళితవాడలో ప్రతిష్ఠించిన అంబేడ్కర్ విగ్రహంతో ఎవరికీ ఇబ్బంది లేదన్నారు. అయితే ఆ మండల అధికారి విగ్రహాన్ని తొలగించడం అన్యాయమన్నారు. ఈ ధర్నాలో కార్మిక సంఘ నాయకులు, దళిత సంఘ నాయకులు దాసరి చంద్ర, ఎం విజయ కుమార్, పి.రఘు దాసర్లపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయాల జీతం వెంటనే మంజూరు చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఐదు నెలల జీతం వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ, ఆయమ్మల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయమ్మల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయమ్మలకు ఐదు నెలల జీతాలు ఇవ్వలేని దుస్థితిలో కూటమి సర్కారు ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిరుఉద్యోగుల ఆవేదన అర్థం కాదా? అని ప్రశ్నించారు. ఆయాలకు చీపురుకట్టలు, పెనాయిల్, గ్లౌజు, సోపులు ప్రభుత్వమే మంజూరు చేయాలన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, దాసరి చంద్ర, రమాదేవి, దామోదరం, రఘు, ఇంద్రాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు వదిలి వెళ్లమంటున్నారు

ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమ గ్రామాలను వదిలి వెళ్లాలని తిరుపతికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి భయాందోళనలకు గురి చేస్తున్నాడని పులిచెర్ల మండలం సూవారపువారిపల్లి వాసులు ఆరోపించారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. లక్ష్మమ్మ, వెంకటరమణ, రమేష్‌లు మాట్లాడుతూ తమ గ్రామంలో 60 కుటుంబాలకు పైగా నివాసమున్నాయని చెప్పారు. 200 ఏళ్ల నుంచి తమ పూర్వీకులు ఇదే గ్రామంలో ఉంటున్నారన్నారు. తిరుపతికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి తమ గ్రామంలోని ఇళ్లను కూల్చేస్తున్నారన్నారు. ఊరు వదిలి వెళ్లాలని భయాందోళనకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.


సమస్యను వెల్లడిస్తున్న సూవారపువారిపల్లి వాసులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల షెడ్డును కూల్చేశారు!


వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ముందున్న షెడ్డును పోలీసుల సాక్షిగా తొలగిస్తున్న అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత ఎన్నికల్లో తాము వైఎస్సార్‌సీపీ కోసం గట్టిగా కష్టపడ్డామని, తమపై కసి పెంచుకున్న టీడీపీ నాయకులు అధికారులతో ఇంటి ముందున్న రేకుల షెడ్డును కూల్చివేయించారని పెద్దపంజాణి మండలం శివాడికి చెందిన సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. గ్రామంలోని ఓ వీధిలో సుబ్రమణ్యం నివాసం చిట్టచివర ఉంది. ఈ ఇంటి పక్కన పొలాలు మాత్రమే ఉన్నాయి. వీరి ఇంటి ముందున్న సెంటు ఖాళీ స్థలాన్ని 2014లో అదే గ్రామానికి చెందిన రామమూర్తి, చంద్రశేఖర్ల వద్ద సుబ్రమణ్యం కొనుగోలు చేసి పత్రం కూడా రాయించుకున్నాడు. ఈ స్థలంలో షెడ్డు వేసి అందులో పశువులను కట్టి ఉంచుకుంటున్నాడు. ఇలా ఉండగా ఇటీవల ఇదే వీధిలో సిమెంట్ రోడ్డు వేయాలని అధికారులు ఆ వీధిని సందర్శించారు. తమ ఆధీనంలోని స్థలంలో ఎలా రోడ్డు వేస్తారని బాధితుడు ప్రశ్నించాడు. దీనిపై అదే వీధికి చెందిన కొందరు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై విచారణకు వచ్చిన మండల స్థాయి అధికారులు అక్కడున్న షెడ్డును ఇటీవల పోలీసు బందోబస్తుతో తొలగించేశారు. ఇదంతా పక్కా ప్లాన్‌గా టీడీపీ వాళ్లు చేయించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా ఉండగా ఈ విషయమై స్థానిక తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను వివరణ కోరగా ఆ స్థలం తమ రికార్డుల్లో గ్రామకంఠంగా ఉన్నందున ప్రజా సౌకర్యార్థం అక్కడ సీసీ రోడ్డుకు అడ్డుగా ఉన్న షెడ్డును తొలగించామని తెలిపారు. అధికార పార్టీ కారణంగా తమకు అధికారుల ద్వారా న్యాయం జరగదని భావించిన బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులందరూ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో శిల్ప కళాకారులు, దోభీ, మేస్త్రీ, చేతి వృత్తుల వారికి నైపుణ్యాలను పెంచేందుకు శిక్షణ ఇస్తారన్నారు. ఎల్‌డీఎం హరీష్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజనలో ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రుణాల చెల్లింపులో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కుప్పంలో శిక్షణ పూర్తి చేసిన పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, డీఐసీ జీఎం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కరించండి

జిల్లాలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే సమస్యలను వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీ అందిన పది రోజుల్లోపు పరిష్కరించాలన్నారు. అపార్ కార్డు కసరత్తులో విద్యార్థుల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో భార్యభర్తల ఆత్మహత్య

– మేలుందొడ్డిలో విషాదం


శ్రీనివాసులు


నీలమ్మ మృతదేహం

పుంగనూరు: అనారోగ్యంతో భార్యభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మేలుందొడ్డిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మేలుందొడ్డి గ్రామంలో నివాసం ఉన్న శ్రీనివాసులు(46), అతని భార్య నీలమ్మ(43) టైలర్లుగా పనిచేస్తున్నారు. గతంలో బెంగళూరులో ఉంటూ ఇటీవలే గ్రామానికి వచ్చి నివాసం ఉన్నారు. ఇలా ఉండగా శ్రీనివాసులు కిడ్నీ వ్యాధి ఉండడంతో అప్పులు చేసి చికిత్స చేయించారు. కానీ ఫలితం లేకపోయింది. ఇలా ఉండగా భార్యభర్తలు ఇరువురు మాట్లాడుకుని ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని బైరేబండకు వెళ్లే మార్గంలో చెట్టుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం గ్రామస్తులు కనుగొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ లోకేష్ సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించి, , మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.